తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
01 నవంబర్ 2026
Follow :

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం..

నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..

మిగిలిన పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఎల్లుపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకూ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయితే స్థానికంగానే వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. రెండేళ్లుగా సాగుతున్న నిర్మాణ జాప్యానికి తెరదించి ఆసుపత్రిని ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో అధికారులు సమాధానం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నత్తనడకన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు

- రూ.2.45 కోట్లతో చేపట్టిన పనుల్లో నాణ్యతపై అనుమానాలు..అధికారుల పర్యవేక్షణ ఏదీ?

టేక్మాల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణమే నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపట్టిన పనులు రెండేళ్లు గడుస్తున్నా కొలిక్కి రాకపోవడం, నిర్మాణ నాణ్యతపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంతో ఎల్లుపేట పీహెచ్‌సీ నిర్మాణం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారన్న ఆరోపణల మధ్య సంబంధిత అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 2024లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రూ. 2.45 కోట్ల నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. అయితే రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ఎల్లుపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలపై నిరీక్షణ తప్పడం లేదు. ప్రస్తుతం భవన నిర్మాణం స్లాబ్ స్థాయి వరకు మాత్రమే చేరుకుంది. స్లాబ్‌పై ఇటుకల నిర్మాణం సక్రమంగా లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో కంకర, ఇసుక చువ్వలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. నాసిరకం ఇసుక వినియోగం, సిమెంట్ మోతాదుపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సామగ్రి నాణ్యతను అధికారులు పరిశీలిస్తున్నారా? స్లాబ్ అనంతరం నిబంధనల ప్రకారం క్యూరింగ్ నిర్వహించారా? పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉండగా, ఇక్కడి పనుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ నాణ్యతపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి
పొంచి ఉన్నా.. ఆగని నీటి వృథా!

టేక్మాల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ, బోడగట్టు గ్రామంలో నీటి వృథా మాత్రం అరికట్టలేకపోతున్నారు. నీటి పొదుపుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, పైపులైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం లేదు. బిరడాలు ఏర్పాటు చేసుకోకపోవడంతో సరఫరా అవుతున్న నీరు మురుగు కాలువల్లోకి చేరుతోంది. ఒకవైపు భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే పరిస్థితులు కనిపిస్తుండగా, మరోవైపు అందుబాటులో ఉన్న నీటిని ఇలా వృథాచేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ల లీకేజీలను అరికట్టడంతో పాటు కుళాయిలకు బిరడాలు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అవసరం ఎంతైనా ఉంది.

మాదకద్రవ్యాల రహిత సమాజ
నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- నషా ముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్

మిగతా 5లో..

మెదక్ బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి): మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత

షీ టీమ్స్ నిఘా.. 75 మందికి కౌన్సెలింగ్

- అక్టోబర్‌లో 54 అవగాహన కార్యక్రమాలు.. 2 ఈ-పెట్టి కేసులు నమోదు
- వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు

మెదక్ బ్యూరో, అక్టోబర్ 31(జనంసాక్షి): మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మెదక్, తూప్రాన్ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో సంబంధిత డీఎస్పీల పర్యవేక్షణలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో జిల్లావ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత, వేధింపుల నివారణ, సైబర్ నేరాలపై 54 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. మహిళలను వేధిస్తున్న 75 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, 2 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళలను వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయం లేకుండా తమకు ఎదురయ్యే వేధింపులపై షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

మెదక్‌ను కరువు జిల్లాగా ప్రకటించాల్సిందే!

- రైతుల కష్టాలు కనిపించడం లేదు
- గ్రామం యూనిట్‌గా పంట నష్టాన్ని అంచనా వేయాలి
- కరువు నిర్ధారణలో శాస్త్రీయ విధానాలు పాటించాలి
- మంజీరా జలాలపై మెదక్ రైతులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి
- కరువు జిల్లా ప్రకటించకుంటే దశలవారీ ఉద్యమం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

మెదక్ బ్యూరో, అక్టోబర్ 31(జనంసాక్షి): మెదక్ జిల్లాలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, వర్షాభావం, పంటల నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మెదక్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై మెదక్ సిటిజన్స్ ఫోరం, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(హెచ్143),తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐజేయూ)రైతు స్వరాజ్య వేదిక, మెదక్ స్టడీ సర్కిల్ లు సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం లో వక్తలు మాట్లాడారు. సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి, టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ అజయ్, సిపిఎం నేత మల్లేశం, బీఆర్ఎస్ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మానవ హక్కుల వేదిక నేత హైమద్ లు మాట్లాడుతూ కరువు పరిస్థితుల నిర్ధారణలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తీవ్ర అసంతృప్తి గా ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా మండలాలను ప్రాతిపదికగా తీసుకొని కరువు పరిస్థితులను అంచనా వేయడం వల్ల వాస్తవ పంట నష్టం వెలుగులోకి రావడం లేదని వారు అభిప్రాయపడ్డారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రామంలో పంటల సాగు, వర్షపాతం, దిగుబడి, నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు.కరువు పరిస్థితులను నిర్ధారించే విషయంలో ప్రభుత్వ విధానాల్లో శాస్త్రీయత లోపించిందన్నారు.ఒకే మండలంలో కొన్ని గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతింటే, మరికొన్ని గ్రామాల్లో పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. అలాంటప్పుడు మండలాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి కరువు తీవ్రతను నిర్ణయించడం వల్ల నష్టపోయిన రైతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలవారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి వాస్తవ పరిస్థితుల ఆధారంగా పంట నష్టాన్ని నిర్ధారించాలని డిమాండ్

భారతరత్న ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం: ప్రభుత్వ విప్ యెన్నం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (జనంసాక్షి): భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ఆర్థికాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఇందిరాగాంధీ చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ధైర్యసాహసాలు, దృఢ సంకల్పం, అసాధారణ నాయకత్వ లక్షణాలకు ఆమె ప్రతీకగా నిలిచారని కొనియాడారు. దేశం అనేక సవాళ్లను ఎదుర్కొన్న సమయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు కృషి చేశారని తెలిపారు. బ్యాంకుల జాతీయీకరణ, వ్యవసాయ రంగ అభివృద్ధి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆమె చేసిన సేవలు స్మరణీయమన్నారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఆమె చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఏ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పుట్టి సాయిలు

నిజాంపేట్, అక్టోబర్ 31 (జనంసాక్షి): తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన పుట్టి సాయిలు ముదిరాజ్ నియమితులయ్యారు. హైదరాబాద్ తార్నాకలో రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నియామకాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సాయిలును మండల నాయకులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యువ నాయకులు సుదర్శన్, చరణ్ గౌడ్, శేఖర్ సెట్, సంతోష్, శివకుమార్, అభిషేక్, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి): పోలీసు శాఖకు సుదీర్ఘకాలం అందించిన సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఎస్ఐ టి. నాగేశ్వర్ రావు, హెడ్ కానిస్టేబుళ్లు మహ్మద్ అబ్దుల్ బారీ, వి. సుధర్శన్‌లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. పదవీ విరమణ అనంతరం వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కొడకంచి శ్రీనివాస్ గౌడ్

శివ్వంపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే మహా కార్యక్రమానికి మెదక్ జిల్లా నుండి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, నాయకులు తరలివెళ్లారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు సారథ్యంలో వెళ్లగా, ఇదే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యాపారవేత్త కొడకంచి శ్రీనివాస్ గౌడ్ శనివారం మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షులు వసంతరావును నాగపూర్‌లోని తన గెస్ట్ హౌస్‌లో మైనంపల్లి హనుమంతరావు, ఆంజనేయ గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి, బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి,

శుభాకాంక్షలు తెలియజేశారు. డైనమిక్ లీడర్ కొడకంచి శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పార్టీ కోసం నిరంతరం పనిచేయడం పట్ల కొడకంచి శ్రీనివాస్ గౌడ్ ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షులు వసంతరావు పేర్కొన్నరన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్ రెడ్డి, తదితర ముఖ్య నాయకులు ఉన్నారు.

గొట్లమిట్టలో పౌరహక్కుల దినోత్సవం

- పలువురు అధికారుల హాజరు

కోహెడ, అక్టోబర్ 31(జనంసాక్షి): మండలంలోని గొట్లమిట్ట గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్లమిట్ట గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ ఐ ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు అందరు సమానమేనని ఎక్కడ కూడ ఎక్కువ, తక్కువ అని కుల, మత, తారతమ్య బేధాలు చూపించవద్దని అన్నారు.అలా చూపించినట్లయితే చట్ట రీత్యా చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి విజయ - రాజిరెడ్డి, కోహెడ ఎస్సై పుల్ల అభిలాష్ , ఎంపీడీఓ ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి ,ఉపసర్పంచ్ వేముల మౌనిక- శ్రావణ్ , పాలక వర్గ సభ్యులు రాచూరి ఓదయ్య, బండారి రవీందర్ గౌడ్, కందుకూరి అంతయ్య , అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రాచూరి బుచ్చయ్య, ఆశావర్కర్లు, రేషన్ డీలర్, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

సిర్గాపూర్, అక్టోబర్ 31(జనంసాక్షి): సిర్గాపూర్ మండలం సంగం గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.మండల పశువైద్యాధికారి లిడాక్టర్ జేసీ క్రాంతిలి పాల్గొని పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరంలో 120 పశువుల కులి ఎల్ఎస్టీ టీకాలు, కృత్రిమ గర్భధారణలు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధర్యా నాయక్, నాయకులు పాల్గొన్నారు.

బల్కంచెల్క తాండాలో వీబీజీ రామ్‌జీ గ్రామసభ

నిజాంపేట్, అక్టోబర్ 31 (జనంసాక్షి): నిజాంపేట్ మండలంలోని బల్కంచెల్క గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం వీబీజీ రామ్ జీ పథకంపై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ సంగ్రామ్ మాట్లాడుతూ... వీబీజీ రామ్ జీ పథకం కింద ప్రతి ఒక్కరూ గ్రామంలో ఇంకుడు గుంతలు, బర్రెల షెడ్లు, గొర్రెల షెడ్లు, ఇంకుడు గుంతలు, బోర్ల దగ్గర స్టోరేజ్ ట్రక్కర్లు, పంట కుంటలు వంటి వివిధ పనులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో నీటి

కొరత ఏర్పడే అవకాశం ఉందని, అందువల్ల ఇప్పుడే భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పనులు చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిత తుకారం, ఉప సర్పంచ్ విజయలక్ష్మి శంకర్, పంచాయతీ కార్యదర్శి దేవయ్య, టిఏ శివశంకర్ ,వార్డుభ్యులు దేవిసింగ్, విజయ, మన్మోహన్ నాయక్, ఉపాధ్యాయులు తాండవాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి

జగదేవ్‌పూర్, అక్టోబర్ 31 (జనంసాక్షి): పౌర హక్కులపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జగదేవ్‌పూర్ ఏఎస్ఐ సుభాష్, ఆర్ ఐ సత్యనారాయణలు పేర్కొన్నారు.. శనివారం మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో ఎస్సీ కాలనీలో పౌర హక్కులదినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పౌర హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కోరారు. కుల మత వర్గ బేధాలకు అతీతంగా సమానత్వ భావనతో మెలగాలని సూచించారు.

పౌర హక్కులతో పాటు తమ బాధ్యతలను కూడా గుర్తించి సమాజ శ్రేయస్సుకు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పౌర హక్కులపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత పరశురామ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు దయానంద్ రెడ్డి, ఐలయ్య, ఈశ్వర్, కనకయ్య, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి రూ.50వేల విరాళం

గండీడ్,అక్టోబర్ 31(జనంసాక్షి): ఆధ్యాత్మిక చింతన,భక్తిభావంతో ఆలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని,పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు.గండీడ్ మండల పరిధిలోని జానంపల్లి గ్రామంలో నూతనంగా చేపడుతున్న శివాలయ నిర్మాణానికి ఆయన రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.భగవంతుని సేవలో భాగంగా ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి,ఉమ్మడి గండీడ్ మండల మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డిని,పార్టీ మండల అధ్యక్షుడిని గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా, శివాలయ ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన మాజీ ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో ఉమ్మడి గండీడ్ మండల మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్,బాలవర్ధన్‌రెడ్డి,చంద్రయ్య,గుర్రాల చెన్నయ్య, భూదేవి,

రవీందర్‌రెడ్డి,గోవిందురెడ్డి,నరసింహులు,రవి,గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జట్లకు చేర్యాల గురుకుల విద్యార్థుల ఎంపిక

చేర్యాల, అక్టోబర్ 31 (జనంసాక్షి): చేర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల నుండి రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ జట్లకు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పోలోజు నరసింహాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద జిల్లా స్థాయి అండర్-17 పోటీలు సిద్దిపేటలోని ఎల్లంకి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించగా, చేర్యాల గురుకుల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రతిభతో వాలీబాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి జట్లకు విద్యార్థులు ఎంపికయ్యారని, అలాగే 200 మీటర్ల పరుగు పందెంలో విద్యార్థి దృశ్యంత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని పేర్కొన్నారు. కళాశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సురేష్, పీఈటీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో అదనపు కోర్టు మంజూరుకు వినతి

- సానుకూలంగా స్పందించిన హైకోర్టు న్యాయమూర్తి

చేర్యాల, అక్టోబర్ 31 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జువైనల్ కోర్టు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శరత్ ను చేర్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చేర్యాల కోర్టులో సివిల్, క్రిమినల్ కేసుల పెండెన్సీ విపరీతంగా పెరిగిపోయిందని, ప్రజలకు వేగంగా న్యాయసేవలు అందించేందుకు చేర్యాలలో అదనపు కోర్టును మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం న్యాయమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. న్యాయవాదుల వినతిపత్రంపై హైకోర్టు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. కేసుల పెండెన్సీ వివరాలను పరిశీలించి అదనపు కోర్టు మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరెళ్ల వీరమల్లయ్య, ఉపాధ్యక్షుడు కాటం సురేందర్, సీనియర్ న్యాయవాదులు ఆరెళ్ల మహేందర్, పొన్నం సురేష్ కృష్ణ, గుస్స వెంకటేశం, దర్శనం ప్రశాంత్, నీరటి రాజలింగం, రిక్కల రామకృష్ణారెడ్డి, పర్వతం రాములు, బైరగోని ప్రసాద్ గౌడ్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

నవంబర్ 2న బీజేపీ మహా పాదయాత్ర

- ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా..
- జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలి: ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం, అక్టోబర్ 31(జనంసాక్షి): ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా నవంబర్ 2న బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. మహా పాదయాత్ర విజయవంతానికి సంబంధించి సంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకుల సన్నాహక సమావేశం శనివారం రామచంద్రాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ సంస్థలను అప్రతిష్టపాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న కుట్రపూరిత రాజకీయాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. నిజాం కళాశాల వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి మొజంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రవీందర్, నరేన్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి

- ఎస్హెచ్‌వోలు, కోర్టు సీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించిన మెదక్ జిల్లా అదనపు ఎస్పీ. విక్రాంత్ కుమార్ సింగ్

మెదక్ బ్యూరో, అక్టోబర్ 31(జనంసాక్షి): కోర్టు కేసుల విచారణను వేగవంతం చేసి, నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో (సీడీఓలు) ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించారు. సమన్లు, వారెంట్ల అమలులో జాప్యం జరగకుండా చూడాలని, సాక్షులను సకాలంలో కోర్టులకు హాజరుపరచాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌ఓలు కేసుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్రమైన నేరాల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కా సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో సమర్పించాలని సూచించారు. విధి నిర్వహణలో జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వరావు, డీసీఆర్‌బీ సీఐ జార్జ్, సీఐ మహేష్, ఎస్ఐలు, కోర్టు సీడీఓలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం నర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి...

- ధర్నాకు తెలంగాణ రక్షణ సేన పార్టీ మద్దతు: దండే అపర్ణ

కొల్చారం, అక్టోబర్ 31 (జనంసాక్షి): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నర్సింగ్ సిబ్బంది చేపట్టిన ధర్నాకు తెలంగాణ రక్షణ సేన పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దండె అపర్ణ మద్దతు ప్రకటించారు. ముందుగా ప్రసిద్ధ సి.ఎస్.ఐ కేథడ్రల్ చర్చిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఆమె, అనంతరం ధర్నా శిబిరానికి చేరుకుని నర్సింగ్ సిబ్బందికి సంఘీభావం తెలిపారు.
ఈ సందర్భంగా దండె అపర్ణ మాట్లాడుతూ... రాత్రింబవళ్లు ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం నర్సింగ్ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక నర్సింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది సేవలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు, అర్హులైన సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నర్సింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, నర్సింగ్ సిబ్బంది, తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఠాగూర్ తండాను ఊరుకొండ పేట గ్రామపంచాయతీలో కొనసాగించాలి

- అమ్మపల్లి పంచాయతీ ప్రపోజల్ నుండి తొలగించాలని ఎంపీడీవోకు వినతి

ఊర్కొండ, అక్టోబర్ 31, (జనంసాక్షి); నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామ పంచాయతీలోని ఠాగూర్ తండా వాసులు తమ తండాను అమ్మపల్లి తండా గ్రామ పంచాయతీ ప్రపోజల్ నుండి తొలగించాలని ,ఉరుకొండ పేట గ్రామ పంచాయితీలో కొనసాగించాలని కోరుతూ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్ నాయక్ లకు శనివారం వినతి పత్రం అందజేశారు.
తమ తండాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, కాబట్టి ప్రతిపాదన నుండి తొలగించి ఊర్కొండపేటలోనే కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అబ్దుల్ రషీద్, తండవాసులు , మాజీ ప్రజా పతినిధులు ,,గ్రామస్తులు పాల్గొన్నారు.

భూనీడ్‌లోనే పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

- పోలీస్ స్టేషన్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ గ్రామస్తుల రాస్తారోకో

కొత్తపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి): కొత్తపల్లి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ కార్యాలయం ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం భూనీడ్ గ్రామస్థులు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో తిరుపతిరెడ్డి భూనీడ్ గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పోలీస్ స్టేషన్‌తో పాటు ప్రభుత్వ ఆసుపత్రిని కూడా భూనీడ్ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. భూనీడ్ గ్రామంలోనే పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా ఎస్పీ వినీత్‌తో పాటు పలువురు అధికారులు కొత్తపల్లిలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించడంతో గ్రామస్తుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం భూనీడ్‌లోనే పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో, ధర్నాలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

రాజ్యాంగ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి...

• తహశీల్దార్ మాలతి, ఎస్ఐ శివానందం

చిన్న శంకరంపేట, అక్టోబర్ 31(జనంసాక్షి): సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం లభించినప్పుడే వివక్ష లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తహశీల్దార్ మాలతి అన్నారు. చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ సంగని సునీత యాదగిరి అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ మాలతి, ఎస్ఐ శివానందం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి అనేక హక్కులను కల్పించిందని, వాటిపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.

కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ పరస్పర గౌరవంతో మెలగాలని, ఇతరుల హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించాలని తెలిపారు. సమాజంలో అంటరానితనం, సామాజిక వివక్ష వంటి దురాచారాలకు చోటు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పౌర హక్కుల పరిరక్షణతో పాటు సమాజం పట్ల తమ బాధ్యతలను కూడా గుర్తించాలని సూచించారు.

రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో పౌర హక్కులపై అవగాహన పెంపొందించడం ద్వారా సామాజిక అసమానతలను తగ్గించి, సమాన హక్కులు కలిగిన సమాజాన్ని నిర్మించవచ్చని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగని సునీత యాదగిరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, వినయ్, ఉపసర్పంచ్ కుంట రాజు, వార్డు సభ్యులు నాగమణి శేఖర్ యాదవ్, మానస మహేష్, సంగని జైపాల్, మాజీ ఉపసర్పంచ్ మనోజ్ కుమార్, గ్రామస్తులు యాదగిరి, సంజీవ్, గడ్డం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి
హరీష్ రావు ఆర్థికసాయం

నంగునూర్, అక్టోబర్ 31(జనంసాక్షి): రాజగోపాల్ పేట గ్రామానికి చెందిన ఎలా సాయమల్లు ఇటీవల మృతి చెందగా, వారి బాధిత కుటుంబాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువకులు, పెద్దలు మరియు కార్యకర్తలు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు గారి సహకారంతో రూ. 5,000 (ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బాధిత కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అండదండలు, సహకారం ఈ కుటుంబానికి ఎల్లప్పుడూ ఉంటాయని వారు భరోసా ఇచ్చారు.

బిజెపి ఆధ్వర్యంలో పట్టభద్రుల
ఓటు నమోదు శిబిరం ప్రారంభం

ఆత్మకూర్, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఆత్మకూరు మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్ వరకు డిగ్రీ, డిప్లమా, బీటెక్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ డిగ్రీ మెమో, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, పాస్ పోర్ట్ ఫోటో తీసుకొని వచ్చి ఇక్కడ ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. రోజంతా ఈ ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని, పార్టీలకతీతంగా డిగ్రీ పూర్తి చేసిన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బిజెపి నాయకులు తెలియజేశారు. మక్తల్ ఎన్నికల సహా ఇంచార్జ్ జిందే జ్యోతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ యాదవ్, టౌన్ అధ్యక్షుడు మండల సురేష్ కుమార్, కౌన్సిలర్లు జ్యోతి శ్రీనివాస్, చెట్ల లలిత, జనరల్ సెక్రటరీ పుల్లారి రమేష్, ఎల్లన్న, మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్, జిల్లా నాయకులు శివశంకర్, కొండాపురం రాము, ఆనంద్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆంజనేయులు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాసన్న, శ్యామ్, బోరెల్లి రాము, సమ్మద్, రాఘవేందర్ రెడ్డి, టి. నరేష్, బాలరాజ్ యాదవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నంగనూరులో బీఆర్ఎస్వీ నూతన కమిటీల నియామకం

నంగనూరు, అక్టోబర్ 31 (జనంసాక్షి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు నంగనూరు మండలంలోని ఆరు గ్రామాల్లో బీఆర్ఎస్వీ నూతన విద్యార్థి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల సమన్వయ కమిటీ సభ్యులు తెలిపారు.

అప్పలాయ చెరువులో గట్టు దుర్గాప్రసాద్, రాంపూర్‌లో మాలోతు తిరుపతి, సిద్ధన్నపేటలో ఎండీ ఇర్ఫాన్, వెంకటాపూర్‌లో శ్రీకాంత్, మైసంపల్లిలో ఖాత రజనీకాంత్, తిమ్మాయిపల్లిలో చెట్టబోయిన కుమార్ అధ్యక్షులుగా ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం, గురుకులాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం విచారకరమన్నారు.

విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్
ప్రదీప్ కుమార్‌కు ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు

అమీన్పూర్, అక్టోబర్ 31 (జనంసాక్షి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పని సరి అని అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసి శనివారం పదవీ విరమణ పొందిన ప్రదీప్ కుమార్ కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల పాండు రంగారెడ్డి మాట్లాడుతూ... ప్రదీప్ కుమార్ గతంలో ఎన్నో ఉన్నతమైన పదవుల్లో, వివిధ కీలక బాధ్యతల్లో ఉంటూ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. అమీన్‌పూర్ సర్కిల్‌గా ఏర్పడిన తర్వాత డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందించారని ప్రశంసించారు. పరిపాలనాపరంగా ఎంతో అనుభవం ఉన్న అధికారి తమ ప్రాంతంలో పనిచేసి ఇక్కడే పదవీ విరమణ పొందడం ఈ ప్రాంతానికి లోటు కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, బిజిలి రాజు, నాయకులు తలారి రాములు, ప్రమోద రెడ్డి, దాసు యాదవ్, పలువురు స్థానిక నాయకులు, పురపాలక అధికారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల నూతన తహసీల్దార్‌గా మల్లెల స్వప్న

• నాగర్‌కర్నూల్ డివిజన్ కార్యాలయం నుంచి బదిలీ

ఉప్పునుంతల, (జనంసాక్షి): ఉప్పునుంతల మండల నూతన తహసీల్దార్‌గా శ్రీమతి మల్లెల స్వప్న బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆమె నాగర్‌కర్నూల్ డివిజన్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై ఉప్పునుంతల మండలానికి వచ్చి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

చేర్యాలలో రోడ్డు ప్రమాదం

• తప్పిన పెను ముప్పు

చేర్యాల, అక్టోబర్ 31 (జనంసాక్షి): చేర్యాల పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాలీ ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న సిమెంట్ షాపులోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో షాపులో ఎవరూ లేకపోవడం, రోడ్డుపై రద్దీ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ఆటో, షాపు ముందు భాగం ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకుంఠధామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి: సర్పంచ్ ప్రవీణ్

చిన్న శంకరంపేట్, అక్టోబర్ 31(జనంసాక్షి): వైకుంఠ దామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ అన్నారు. చిన్నశంకరంపేట మండలం చందంపేటలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం గ్రామపంచాయతీ పరిధిలోని వైకుంఠధామం డంప్ యార్డ్ క్లీనింగ్ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలందరూ వైకుంఠధామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. సెక్రటరీ సంతోష్ కుమార్, ఉపసర్పంచ్ నర్సింహులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి
అండగా మాజీ జెడ్పీటీసీ

కొండపాక, అక్టోబర్ 31 (జనంసాక్షి): కొండపాక మండల కేంద్రానికి చెందిన నిరుపేద కొమ్ము రామచంద్రం అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ జెడ్పీటీసీ అనంతుల అశ్విని ప్రశాంత్ స్పందించారు. మృతుడి కుటుంబానికి స్థానిక నాయకుల ద్వారా ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు ఎలాంటి ఆపద వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కొమ్ము వెంకటరమణ, ఆరుట్ల కనకరాజు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు

సిర్గాపూర్, అక్టోబర్ 31 (జనంసాక్షి): సిర్గాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థుల మండలస్థాయి ఆటల పోటీలను ఎంఈఓ నాగారం శ్రీనివాస్ ప్రారంభించారు. దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం, మానసిక ఉల్లాసం నింపేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులను హేళన చేయడం చట్టరీత్యా నేరమని, వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే అద్భుత ఫలితాలు

• ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 31 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి శిక్షణ ఇస్తే అద్భుత ఫలితాలు వస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం గొల్లపల్లి లలితాంబికా తపోవనంలో మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10 రోజుల ఉచిత ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల విద్యపై దృష్టి పెడితే అద్భు

తాలు జరుగుతాయని, ఈ శిబిరం విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది అని పేర్కొన్నారు. శిబిరంలో 190 మంది విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. గత ఏడాది జిల్లాకు వచ్చిన 72 స్కాలర్‌షిప్ లలో 60 ఇక్కడే శిక్షణ పొందిన వారికి రావడం సంతోష కరమన్నారు. విద్యార్థులపై పెట్టే ఖర్చు దేశ భవిష్యత్తుకు మూలధనం వంటిదని చెప్పారు. కార్యక్రమంలో వందేమాతరం వ్యవస్థాపకుడు రవీందర్, భాస్కర్, దయాకర్, రవీందర్‌రెడ్డి, చెన్నప్ప, మనోహర్ గుండా, మైత్రి యాదయ్య పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచిన ఘనత ఇందిరాగాంధీదే: జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 31 (జనంసాక్షి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఐబీ ఎదురుగా ఉన్న ఆమె విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు భూములు పంపిణీ చేసి, వారి ఆర్థిక అభివృద్ధికి ఇందిరాగాంధీ విశేష కృషిచేశారని కొనియాడారు.

బ్యాంకుల జాతీయాకరణతో సామాన్యులకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేశారని గుర్తుచేశారు. మెదక్ ఎంపీగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఆమెకు సంగారెడ్డితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఓడీఎఫ్, బీడీఎల్ పరిశ్రమల ఏర్పాటుకు ఆమె కృషి చేశారని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం కీలక నిర్ణయాలు తీసుకున్న ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని అన్నారు. ఆమె ఆశయాలను రాహుల్ గాంధీ కొనసాగిస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ రాజీలేని పోరాటం

• ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు అందె అశోక్

• ఘనంగా కార్మిక సంఘం 107వ ఆవిర్భావ వేడుకలు

చేర్యాల, అక్టోబర్ 31(జనంసాక్షి): కార్మికుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న గొప్ప కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అందె అశోక్ అన్నారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణం లోని గాంధీ సెంటర్ వద్ద సంఘం జెండాను అందే అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1920 అక్టోబర్ 31న ముంబై నగరంలో ఆవిర్భవించి నేటికి 107 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన ఏకైక సంఘం ఏఐటీయూసీదేనని పేర్కొన్నారు. దేశంలో కార్మికులు రక్తం ధారపోసి అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, హక్కులను కేంద్ర బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్‌కోడ్ లను తీసుకొచ్చి అసంఘటిత, సంఘటిత రంగ కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులను ఉడిగం చేయడం బిజెపి దుర్మార్గపు పాలనకు నిదర్శనమని అన్నారు. పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్ రెడ్డి,నంగి కనకయ్య, గూడెపు సుదర్శన్, పాల సాయిలు, పోషబోయిన పరమశేఖర్, నంగి సత్తయ్య, దండబోయిన వెంకటేష్, శిగుళ్ల నరేష్, గోమవరపు నర్సయ్య, ముచ్చాల నర్సింహులు, మల్లేశం, మహేందర్ రెడ్డి, రాజు, కుమార్, రాజిరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు, విద్యార్థుల విద్యాభ్యాసం, కుటుంబ వ్యవస్థ మరియు సమాజంపై తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన నిఘా ఏర్పాటుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలలనీ,మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి అవసరమైన వైద్య సేవలు, కౌన్సెలింగ్ మరియు పునరావాస సహాయం అందించాలన్నారు. పిల్లలు, కౌమారదశ యువతలో మాదకద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన కల్పించాలినీ, ప్రతిశాఖ తన పరిధిలో చేపట్టిన కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యసాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ అహ్మద్ , మున్సిపల్ కమీషనర్ నవీన్ డి సి ఆర్ బి డి ఎస్ పి వెంకటేశ్వర రావు, జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, డి ఐ ఈ ఓ మాధవి, శ్రీనివాస్ రావు ఎడి, డీఈవో, సీడీపీవో లు, హుస్సేన్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, ఏఆర్‌ఈఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సునీత రాకేష్, ఇర్కా విజన్ ఎన్జీవో ప్రతినిధి ఆభరణ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఎస్పీ ఘన నివాళి

• పోలీసు సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ తొలి ఉప ప్రధానమంత్రి, తొలి హోంమంత్రి అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యం అనంతరం 565 సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి దేశ ఐక్యతకు బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ఆయన దృఢమైన నాయకత్వం, పట్టుదలతో దేశ సమగ్రతను కాపాడటంలో కీలకపాత్ర పోషించారని, అందుకే ఆయనను భారత ఉక్కు మనిషిగా గౌరవంగా స్మరించుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణతోనూ పటేల్‌కు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరా బాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తుచేశారు. జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడటం, సమాజంలో శాంతి సామరస్యాలను పెంపొందించడం, దేశ సేవకు అంకితభావంతో పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, పరిపాలనాధికారి పద్మావతి, సైబర్ విభాగం డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

• కోహిర్‌లో మండల స్థాయి సీడీఎస్ విద్యార్థుల క్రీడా పోటీలు

కోహిర్, అక్టోబర్ 31 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ బాయ్స్ పాఠశాలలో శనివారం ప్రత్యేక అవసరాలు కలిగిన (సీడీఎస్) విద్యార్థులకు మండల స్థాయి ఆటలు, క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల వయస్సు, శారీరక సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని

వివిధ రకాల ఆటలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, నిర్వాహకులు చిన్నారులను ప్రోత్సహిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. క్రీడలతో శారీరక చురుకుదనం, మానసిక ఉల్లాసం, ఆత్మస్థైర్యం, సహకార భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థి పాల్గొనడమే ముఖ్యమన్నారు.

దివ్యాంగ చిన్నారులకు సాధారణ విద్యార్థులతో సమానంగా విద్య, క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో అవకాశాలు కల్పించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు వారిలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ భారతదేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం

• మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్

కోహెడ, అక్టోబర్ 31 (జనంసాక్షి): మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 42వ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్ ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పని చేసిన ఉక్కుమహిళ ఇందిరా గాంధీ విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకవచ్చి దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించిన దార్శనికురాలు అని అన్నారు.

ఇప్పటికి ఆమె చేసిన సేవలు పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచాయి కాబట్టే తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారి ఆశయాలకు అనుగుణంగానే పని చేస్తోందని, అందుకే పేద ప్రజల యొక్క ఆత్మ గౌరవాన్ని నిలిపేలా ఇందిరా గాంధీ పేరు మీద ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ఈ ప్రజా పాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరా గాంధీ ఆశయాలకు అనుగుణంగానే పని చేస్తోందని సుధాకర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బోయిని నిర్మల – జయరాజు, వైస్ చైర్మన్, డైరెక్టర్ లు,సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు,పలు గ్రామాల సర్పంచ్ లు,వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు మహిళ కాంగ్రెస్ నాయకురాళ్లు,ఎన్ ఎస్ యూ ఐ నాయకులు, అభిమానులు తదితరులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ, భద్రతే లక్ష్యం: జిల్లా ఎస్పీ డి.జానకి

- **నేరాల నివారణకు కార్డన్ అండ్ సెర్చ్**
- **మాచారంలో పోలీసులు ముమ్మర తనిఖీలు బెల్ట్ షాప్ రద్దు, వాహనాల స్వాధీనం**

జడ్చర్ల, అక్టోబర్ 31 (జనం సాక్షి): నేరాల నియంత్రణ, ప్రజల భద్రతతో పాటు పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ తెలిపారు. శనివారం జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచారం గ్రామంలో పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు గ్రామంలోని 200కు పైగా ఇళ్లను సందర్శించి నివాసితుల వివరాలు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన వాహన పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై దాడులు చేసి 36 బీర్ బాటిళ్లను పట్టుకుని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ ముందస్తు చర్యల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో నేరాలను అరికట్టి సురక్షిత వాతావరణం కల్పిస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ వాడాలని స్పష్టం చేశారు. గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు క్లిక్ చేయవద్దని, ఓటీపీలు పంచుకోవద్దని కోరారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణరెడ్డి, జడ్చర్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- **కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఏళ్ల సురేందర్ రెడ్డి డిమాండ్**

ఉప్పునుంతల, (జనంసాక్షి): ఉప్పునుంతల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఏళ్ల సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన జాబితాలో ఉప్పునుంతల మండలానికి చోటు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడి, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయి, పెట్టుబడులు సైతం చేతికందక రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి ఉప్పునుంతల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని ఏళ్ల సురేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం...

- **ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్**

నంగునూరు, అక్టోబర్ 31 (జనం సాక్షి): భారత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. దేశ ఐక్యత, సమగ్రత, పేదల సంక్షేమం కోసం తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ ధైర్యంతో తీసుకున్న నిర్ణయాలు, చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు ఎండి ఇమ్రాన్ మాట్లాడుతూ.. ఆమె చూపిన పట్టుదల, నాయకత్వ లక్షణాలు నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్లు జీవన్ నాయక్, పిడిచెట్టు ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, అజయ్, భాను, బాబు, శంకరయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవాలు చిరస్మరణీయం

రాజాపూర్, అక్టోబర్ 31(జనంసాక్షి): రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బుడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఇందిరాగాంధీ చిరస్మరణీయంగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి, యాదయ్య, గోవర్ధన్ రెడ్డి,మాసయ్య, రఘుపతి, శంకరయ్య, శివ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముురుగు కాలువలో పడి యువకుడి మృతి

ధన్వాడ అక్టోబర్ 31 (జనంసాక్షి): ధన్వాడ మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. లడ్డ నవీన్ (27) ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి మృతి చెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై కృష్ణంరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నవీన్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడని స్థానికులు తెలిపారు. ముగ్గురు అక్కలకు తమ్ముడైన నవీన్ కుటుంబానికి ఒక్కగానొక్క కొడుకు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న కొడుకు దూరం కావడంతో వారి రోదనలు స్థానికులను కలచివేశాయి. యువకుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

బద్రిగూడెంలో డీసీఎంఎస్ వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఆంజనేయులు**

చౌట్కూర్ అక్టోబర్ 31(జనంసాక్షి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకొని లబ్ధి పొందాలని దళారులకు నమ్మి మోసపోద్దని పలువురు ప్రజాప్రతినిధులు సూచించారు. చౌటకూర్ మండల పరిధిలోని బద్రిగూడెం గ్రామంలో శనివారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఆంజనేయులు మాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని తీసుకువచ్చి నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నందికంటి రామచంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, గ్రామాల సర్పంచులు మల్లారెడ్డి, రాజశేఖర్, మల్లికార్జున గౌడ్, భాస్కర్, కాశీ, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచులు గొల్ల మహేష్ యాదవ్, చింత చంద్రయ్య, వెండికోల్ రాములు, ప్రభాకర్ రెడ్డి, సంజయ్ కుమార్, పార్టీ సలహాదారు శివకుమార్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వినయ్ కుమార్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూ సర్వేపై విద్యార్థులకు అవగాహన సదస్సు

- **చైన్ సర్వే, డిజిటల్ కంపాస్ సర్వే పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన**

ఉప్పునుంతల, (జనంసాక్షి): విద్యార్థులకు వ్యవసాయ రంగంలో ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో ఉప్పునుంతల మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వ్యవసాయ భూ సర్వే పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొమ్మిదో, పదో తరగతులకు చెందిన ఒకేషనల్ అగ్రికల్చర్ విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా భూమి సర్వే విధానాలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమానికి భూ సర్వే నిపుణులు అశోక్, అనిల్ హాజరై విద్యార్థులకు చైన్ సర్వే, డిజిటల్ కంపాస్ సర్వే పద్ధతులను వివరించారు. పొలాల కొలతలు ఎలా తీసుకోవాలి, ఎకరాల లెక్కలు ఎలా నిర్ధారించాలి, సర్వే పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలి అనే అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. పుస్తకాల్లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు తెలియజేశారు.
అనంతరం మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇటువంటి ప్రత్యక్ష నైపుణ్య తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలతో పాటు క్షేత్రస్థాయిలో అనుభవం పొందడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో వివిధ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నీలా శ్రీధర్, ఉపాధ్యాయులు సతీష్, శ్యాంసుందర్, అజ్మతుల్లా, మల్లారెడ్డి, గోపి, రాజవర్ధన్ రెడ్డి, కల్పన, శ్యామల గౌరీ, బిల్కిస్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు అంజన్ కుమార్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్ సుల్తాన్‌పూర్‌లో ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- **అధునాతన ఇంజినీరింగ్ సిమ్యులేషన్ టూల్స్‌పై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన**

చౌట్కూర్, అక్టోబర్ 31(జనంసాక్షి): ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఆర్‌కే ఇన్ఫోసొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో అక్టోబర్ 27 నుంచి 31 వరకు ఈ వర్క్‌షాప్ కొనసాగింది.

ఇందులో భాగంగా అధునాతన కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజినీరింగ్ సీఏఈ, ఇంజినీరింగ్ సిమ్యులేషన్ టెక్నాలజీలపై విద్యార్థులకు నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఫైనైట్ ఎలిమెంట్ అనాలిసిస్ ఎఫ్ఈఏ స్ట్రక్చరల్ డైనమిక్స్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ సీఎఫ్‌డీ ఫ్లూయిడ్ స్ట్రక్చర్ ఇంటరాక్షన్ ఎఫ్ఎస్ఐ ఏరోడైనమిక్స్, మల్టీ ఫిజిక్స్ ఫ్లో తదితర ఆధునిక సాంకేతిక అంశాలను విద్యార్థులకు వివరించారు. పరిశ్రమల్లో ఉపయోగించే ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్ టూల్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు వాటి వినియోగంపై ప్రాయోగిక శిక్షణ అందించారు.

ఈ కార్యక్రమానికి ఏఆర్‌కే ఇన్ఫోసొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అప్లికేషన్ ఇంజినీర్ సీఎఫ్‌డీ జిష్ణు రఘునాథ్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. వివిధ ఇంజినీరింగ్ సిమ్యులేషన్ విధానాలు, వాటి ప్రాధాన్యత, పరిశ్రమల్లో వాటి వినియోగంపై విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథ రాజు మాట్లాడుతూ, పారిశ్రామిక రంగంలో ఆధునిక ఇంజినీరింగ్ సాంకేతికతలకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. విద్యార్థులు తరగతి గదుల్లో పొందే విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన ప్రాయోగిక పరిజ్ఞానాన్ని కూడా అలవర్చుకోవాలని సూచించారు.

వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రాఘవేందర్ రావు మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాఫ్ట్‌వేర్ టూల్స్‌పై నైపుణ్యం సాధించాలని పేర్కొన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శైలజ ఎఫ్ఈఏ, సీఎఫ్‌డీ, స్ట్రక్చరల్ డైనమిక్స్ వంటి సాంకేతిక అంశాలపై అవగాహన పరిశోధన, డిజైన్ రంగాల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఐదు రోజుల శిక్షణ ద్వారా విద్యార్థులకు నిపుణుల మార్గదర్శకత్వంలో విలువైన సాంకేతిక పరిజ్ఞానం లభించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఏఆర్‌కే ఇన్ఫోసొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

చాకరిమెట్లలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

- **పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు**

శివ్వంపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి): రాష్ట్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దట్టమైన అడవుల్లో కొలువై ఉన్న చాకరి మెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి వారిని శనివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గాదే ప్రవీణ్ కుమార్ దర్శించుకొని ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మతోపాటు, అర్చకులు హైకోర్టు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికీ పంచామృతాభిషేకం, మన్య సూక్త పారాయణం, బిల్వ దళార్చన, ఆకు పూజ, చందన అభిషేకం లతో వివిధ రకాలైన ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గాదే ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ సహకార ఆంజనేయ స్వామి దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మతోపాటు అర్చకులు న్యాయ మూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అక్కడి నుంచి సీత రామచంద్రస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ఆంజనేయ శర్మ, జిల్లా జడ్జి నీలిమ, వివిధ కోర్టుల జడ్జీలతోపాటు, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ప్రధాన అర్చకులు శాస్త్రవేత్త శర్మ, పూజారులు దేవి ప్రసాద్ శర్మ, ప్రభురాజశర్మ, రమేష్ పంతులు, సిబ్బంది రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సహకార శాఖలో 32 ఏళ్ల సేవలందించి పదవీ విరమణ

సంగారెడ్డి, అక్టోబర్ 31 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఏ. ఆంజనేయులు 32 ఏళ్ల విశిష్ట సేవల అనంతరం శనివారం పదవీ విరమణ చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా అంకితభావంతో సేవలందించడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, టీఎన్జీవో నాయకులు, సహకార శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు మేకల రవి మృతికి సంతాపం

చేర్యాల, అక్టోబర్ 31 (జనంసాక్షి): సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, మాజీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి మృతి పట్ల చేర్యాల సీపీఐ నాయకులు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ముస్త్యాల గ్రామంలో ఉన్న సీపీఐ గద్దె వద్ద పార్టీ జెండాను అవనతం చేసి మేకల రవికి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఈరి భూమయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు గూడెపు సుదర్శన్, సీపీఐ శాఖ కార్యదర్శి మానేపల్లి కిష్టయ్య, సీనియర్ నాయకులు చేరాల స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

మాచిరెడ్డిపల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

- **పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం**

కోహిర్, అక్టోబర్ 31 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం మాచిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టి. మల్లన్న పటేల్ హాజరై నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.

ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవంతో కూడిన సొంత నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు కేవలం నాలుగు గోడల నిర్మాణం కాదని, పేద కుటుంబాల భవిష్యత్తుకు భరోసా, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కోహిర్ పట్టణ చైర్మన్ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముజఫర్ హుస్సేన్, కౌన్సిలర్లు షిరీషా రాణి, జగదీష్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు అశోక్, ఇంజినీర్ మజీద్ అహ్మద్, అష్రఫ్ అలీ, మాజీ ఉపసర్పంచ్ మొహాసిన్ అహ్మద్, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంటల కొనుగోలులో నిబంధనలు తొలగించాలి

- **నంగనూరును కరువు మండలంగా ప్రకటించాలి**
- **మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి**

నంగునూరు, (జనంసాక్షి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవాలక్ష నిబంధనలు విధించి ధాన్యం కొనుగోలులో రైతుల పట్ల తీవ్ర వివక్ష చూపుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. శనివారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ఇక్కడ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు.

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల కఠిన నిబంధనల వల్లే కేంద్రాలకు అనుమతులు రావడం లేదని, వెంటనే పాత పద్ధతిలోనే వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, సర్పంచులు సంతోష్ రెడ్డి, సనాదుల బాల పోచయ్య, నాయకులు కోల మహేందర్ గౌడ్, జయపాల్ రెడ్డి, బెదురు తిరుపతి, శనిగరం బాబు, శ్రీధర్ గౌడ్, మల్లయ్య, వేణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విశేష సేవలు..

- **నాగారం వెంకటేశ్వరరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు**
- **అచ్చంపేట ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం**

అచ్చంపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి): పర్యావరణ పరిరక్షణ రంగంలో విశేష సేవలు అందించిన అచ్చంపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నాగారం వెంకటేశ్వరరావుకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆయన జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో సైన్స్ అసిస్టెంట్‌గా (ఫిజికల్ సైన్స్) పనిచేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, ప్రకృతి పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో ఆయన అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, పర్యావరణ ప్రేమికులు ఆయన సేవలను అభినందించారు. అచ్చంపేట ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడికి జిల్లా స్థాయి గుర్తింపు లభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు అండగా ప్రభుత్వం... ఆరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం!

- మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్
- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

చిలప్‌చేడ్, అక్టోబర్ 31 (జనంసాక్షి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వారి సంక్షేమానికి అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. శనివారం మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండలంలోని ఆరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు.

ఆరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం...

చిలిపిచేడ్ మండలంలో సొసైటీ ఆధ్వర్యంలో సోమక్కపేట, చిలిపిచేడ్, చిట్కూల్ గ్రామాల్లో, ఐకేపీ ఆధ్వర్యం లో రాందాస్‌పల్లి, శీలంపల్లి, చండూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

సన్న వడ్లకు రూ.500 అదనపు బోనస్...

ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర చెల్లిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న ధాన్యానికి క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలు చెల్లిస్తామని చెప్పి రైతులను ప్రలోభపెట్టే ప్రయత్నాలకు లోనుకావద్దని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరతో పాటు వర్తించే అదనపు బోనస్‌ను పొందాలని కోరారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు...

ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ దత్తాత్రి, నర్సింలు, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఎం గౌరీశంకర్, బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, నాయకులు ఎంసీ విట్టల్, యాదగిరి, విట్టల్, శ్రీకాంత్ రెడ్డి, బిక్షపతి పాల్గొన్నారు.

ముస్త్యాలలో సర్వసభ్య సమావేశం

- గ్రామ సమస్యలపై చర్చ

చేర్యాల, అక్టోబర్ 31 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ రైతు వేదికలో శనివారం ఎంపీడీవో ప్రణయ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. గ్రామాభివృద్ధి, ప్రభుత్వ సేవలు, స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లేవనెత్తిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు స్పందించి వివరాలు తెలుసుకుని పరిష్కారంపై హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచిన ఈ సమావేశం గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నాగ్సాన్‌పల్లిలో పౌర హక్కుల దినోత్సవంపై అవగాహన

కౌడిపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లి గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల చివరి రోజున మండల పరిధిలోని ఒక గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పౌరుల హక్కులు, వాటి ప్రాధాన్యత, ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హక్కుల పట్ల చైతన్యం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, జీపీఓ భూపాల్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ పద్మ ఎల్లం, పంచాయతీ కార్యదర్శి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువునే ఆయుధంగా చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

జడ్చర్ల, అక్టోబర్ 31(జనంసాక్షి): విద్యార్థులు చదువునే బలమైన ఆయుధంగా చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత (బాలికల) పాఠశాలను మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 'మన ఊరు - మన బడి' కింద మంజూరై అసంపూర్తిగా ఉన్న మూత్రశాలల పనులను పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. పకడ్బందీ యాక్షన్ ప్లాన్‌తో చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, కఠిన సబ్జెక్టులను తెల్లవారుజామున చదువుతూ ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు కవిత, అమరావతి, శ్రీదేవి, బాలేశ్వరి, కృష్ణ, రవీందర్ సింగ్, ప్రవర్ధిని, స్నేహలత, నిర్మల దేవి తదితరులు పాల్గొన్నారు.

పటేల్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

- రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా మెదక్‌లో రన్ ఫర్ యూనిటీ
- 2కె రన్‌ను ప్రారంభించి, స్వయంగా పాల్గొన్న అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

మెదక్ బ్యూరో, అక్టోబర్ 31(జనంసాక్షి): దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా శనివారం మెదక్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. బోధన్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు రన్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1875 అక్టోబర్ 31న గుజరాత్‌లో జన్మించిన పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానిగా, హోంమంత్రిగా విశేష సేవలందించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం 560కి పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేశారని తెలిపారు. ఆయన దూరదృష్టి, దృఢ సంకల్పం, నాయకత్వం నేటి తరానికి ఆదర్శమన్నారు. భాష, మతం, ప్రాంతాలకు అతీతంగా భారతీయులమనే భావనతో ఐకమత్యంగా మెలగాలని, యువత దేశభక్తి, క్రమశిక్షణ, సోదరభావాన్ని అలవర్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రంగనాథ్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఎస్సైలు, అగ్నివీర్ అభ్యర్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి రైతులు లబ్ధి పొందాలి: తహశీల్దార్ శ్రీనివాస్

కృష్ణ, అక్టోబర్ 31 (జనంసాక్షి): రైతులు వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి లబ్ధిపొందాలని తహశీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మంత్రి శ్రీహరి ఆదేశాల మేరకు క్రిష్ణ మండలంలోని గుడెబల్లూరు, ముడుమాల్, మురహరి దొడ్డి, హిందూపూర్ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ కు 2461 రూపాయలు,సాధారణ రకానికి 2441 రూపాయలు.

అదే విధంగా ఏడు సన్న రకాల ధాన్యానికి 500 రూపాయ లు బోనస్ నిర్ణయించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, అగ్రికల్చర్ ఆఫీసర్ సుదర్శన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, ఉపాధ్య క్షులు సకిరప్ప, కృష్ణ మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, జిపిఓలు, పంచాయతి సెక్రటరీ లు, ఏపీఎం వనిత కుమారి, సీసీ బస్వరాజ్, వివో ఏలు, గ్రామ సంఘ ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల సన్నిధానానికి రూ.లక్ష విరాళం..

- బీజేపీ నేత ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి ఔదార్యం

ఉర్కొండ, అక్టోబర్ 31 (జనంసాక్షి); నియోజకవర్గ పరిధిలో ఎవరికి ఆపద వచ్చిన, దేవాలయాల పునర్నిర్మాణం కొరకు విరాళాలు అందిస్తూ తమ సేవా గుణాన్ని చాటుతున్నారు నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి.జడ్చర్ల పట్టణ మున్సిపల్ పరిధిలో లక్ష్మీనరసింహా అయ్యప్ప స్వాముల సన్నిధానం ఏర్పాటు కోసం ఆధ్యాత్మిక సేవలో భాగంగా తన వంతు సహకారంగా బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. మాలధారణ చేసిన అయ్యప్ప స్వాములకు సౌకర్యాలు కల్పించేందుకు, భక్తుల ఆధ్యాత్మిక అవసరాల కోసం సన్నిధానం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఈ ఆర్థిక సహకారం అందించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకట్ కు నగదు అందజేశారు.

ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు, భక్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తి, సేవాభావంతో ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎడ్ల అమర్నాథ్ గౌడ్, రాష్ట్ర నాయకులు ముచ్చర్ల కృష్ణయ్య, జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్ గౌడ్, మండల అధ్యక్షుడు యట రామకృష్ణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు పల్లె తిరుపతి, కిసాన్ మోర్చా నాయకుడు బుక్క నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటేనే సత్వర న్యాయం

- ఎస్.ఎమ్ నవిద్, ఎస్ఐ

కృష్ణ, అక్టోబర్31(జనంసాక్షి): చట్టాలపై ప్రతి ఒక్క రు అవగాహన కలిగి ఉండా లని అప్పుడే సత్వర న్యాయం దక్కుతుందని ఎస్ఐ నవిద్ అన్నా రు. ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని సినియర్ అసిస్టేంట్, అర్ఐ శ్రీశైలం తెలిపారు. కృష్ణ గ్రామంలో సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు.. కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించు టకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై నవీద్ పంచాయితి కార్యదర్శిలు,సీనియర్ అసిస్టేంట్ శ్రీశైలం, సర్పంచ్‌లు, జిపిఓ, వార్డ్ మెంబర్, పోలీసులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి

- ప్రతి లింక్‌ను పరిశీలించాకే తెరవాలి..
- 'ఆగండి - ఆలోచించండి - ధృవీకరించుకోండి'

వనపర్తి, అక్టోబర్ 31 (జనంసాక్షి): సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండా లని జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి సూచించారు. అనుమానాస్పద సందేశాలు, లింకులు వచ్చినప్పుడు తొందరపడకుండా **'ఆగండి – ఆలోచించండి – ధృవీకరించుకోండి'** అనే మూడు సూత్రాలను పాటించాలని కోరారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి పట్టణంలో సైబర్ అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభమైన ప్రదర్శన అంబేద్కర్ చౌక్ వరకు సాగి తిరిగి కళాశాల వద్ద ముగిసింది. ఎస్పీ సునీత రెడ్డి పాల్గొని పోలీసు అధికారులు, విద్యార్థులతో కలిసి సెల్‌ఫోన్ టార్చ్‌లైట్లు వెలిగిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు నకిలీ లింకులు, వెబ్‌సైట్లు, మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు ఎవరికీ వెల్లడించకూడదని సూచించారు. ఏదైనా సమాచారం వచ్చినప్పుడు దాని నిజానిజాలను అధికారిక మార్గాల్లో ధృవీకరించుకున్న తర్వాతే స్పందించాలని పేర్కొన్నారు.

సైబర్ మోసానికి గురైనవారు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా ఞఞఞ.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ, సీఐలు సుగంధరత్నం, శీను నాయక్, ఎస్సైలు రవి ప్రకాష్, పర్వతాలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో మక్తల్ జానపద నృత్యకారుల అద్భుత ప్రదర్శన

- ఆకట్టుకున్న పల్లెటూరి జానపద గేయం

మక్తల్, అక్టోబర్ 31(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 30న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి జానపద నృత్య పోటీలలో మక్తల్ పట్టణానికి చెందిన కళాకారులు తమ ప్రతిభ తో అందరినీ అబ్బురపరిచారు. పల్లెటూరి వాతావరణాన్ని తలపిం చేలా వీరు ప్రదర్శించిన జానపద గేయం న్యాయనిర్ణేతలు, నిర్వాహకు లు, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

మక్తల్ పట్టణానికి చెందిన విశ్రాంత పీఈటి బి.గోపాలం, కీర్తిశేషు రాలు వెంకటమ్మ దంపతుల ముగ్గురు కూతుర్లు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పెద్ద కూతురు బి.రూప (ఫిజికల్ డైరెక్టర్, కర్ని), రెండవ కూతురు బి.దీప (టీచర్, మక్తల్), మూడవ కూతురు బి.శిల్ప (వెటర్నరీ అసిస్టెంట్, జక్లేర్) లతో పాటు మక్తల్‌కు చెందిన పీఈటి మీనా కుమారి, టీచర్ అశోక్ కుమార్, టీచర్ వాణి తదితరులు ఈ బృందంలో పాల్గొని తమ నృత్య ప్రతిభను చాటుకున్నారు. రవీంద్ర భారతి వేదికపై వీరు ప్రదర్శించిన గ్రామీణ ప్రాంత జానపద నృత్యం అందరి ప్రశంసలు, అభినందనలు అందు కుంది. ఈ సందర్భంగా విశ్రాంత పీఈటి బి. గోపాలం మాట్లాడుతూ మక్తల్ ప్రాంత కళాకారులు రాష్ట్రస్థాయిలో ఇలాంటి గొప్ప ప్రదర్శన చేయడం పట్టణ ప్రజలందరికీ ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, వీరి అద్భుతమైన నృత్య ప్రదర్శన కచ్చితంగా జాతీయ స్థాయి నృత్య పోటీలకు ఎంపికవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

లారీలలో స్థాయికి మించి బరువు తరలిస్తే చర్యలు

- కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి

సంగారెడ్డి, అక్టోబర్ 31 (జనంసాక్షి): లారీలు, ఇతర వాహ నాలలో స్థాయికి మించి బరువు (లోడ్) తరలిస్తే చర్యలతో పాటు జరిమానా విధించడం జరుగుతుందని కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి హెచ్చరించారు. శుక్రవారం జనం సాక్షి పత్రిక లో 'టైర్ల లారీల రవాణాలో భద్రత ఏదీ? అనే వార్తా కథనం ప్రచురించడంతో స్పందించిన ఎస్సై వాహనాలలో అధిక లోడు తరలించిన వాహనాలపై చర్యలతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కొండాపూర్ మండల పరిధిలోని ఎదురుగూడెం, మల్లేపల్లి గ్రామాల్లో ఉన్న టైర్ల కంపెనీకి ఇతర ప్రాంతాల నుంచి భారీ లారీల ద్వారా టైర్లను తరలిస్తున్న క్రమంలో పోలీసులు తనిఖీ చేపట్టి అధిక లోడుతో వెళ్తున్న వాహనాన్ని నిలిపి వాహన యజమానికి రూ .11 వందల జరిమానా విధించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

33 ఏళ్ల నిష్కళంక సేవకు ఘన వీడ్కోలు...

వనపర్తి, అక్టోబర్ 31 (జనంసాక్షి): రెవెన్యూ శాఖలో 33 ఏళ్ల పాటు నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందిన కె. అబ్రహం లింకన్ సేవలు అభినందనీయ మని అదనపు కలెక్టర్ టి.వినోద్ కుమార్ అన్నారు. వనపర్తి ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేసిన అబ్రహం లింకన్ పదవీ విరమణ సందర్భంగా శనివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఓపికగా విని, ప్రేమాభిమానాలతో పరిష్కరించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన సేవాభావం ఉద్యోగులకు ఆదర్శమన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో రామ్‌రెడ్డి, ఆర్డీఓ సుబ్రహ్మ ణ్యం, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ విజేతలకు ప్రశంసా పత్రాలు

గద్వాల, అక్టోబర్ 31 (జనంసాక్షి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన ఫోటో గ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీల విజేతలకు ఎస్పీ శ్రీనివాసరావు శనివారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఫోటోగ్రఫీలో సోమశేఖర్, నవీన్ కుమార్, షార్ట్‌ఫిల్మ్ విభాగంలో పల్లెటూరి కుర్రాళ్ల బృందం ప్రథమ, సురేశ్ ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలను ఎస్పీ అభినందించి, యువత సృజనాత్మక పోటీల్లో పాల్గొనాలని సూచిం చారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పటేల్ జయంతి వేడుకలు

మక్తల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): బీజేపీ మక్తల్ అర్బన్ మండల శాఖ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహిం చారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య మాట్లాడుతూ దేశ ఐక్యత కోసం 560కి పైగా సంస్థానాలను విలీనం చేసిన పటేల్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయ కులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ మృతి

మహమ్మదాబాద్, అక్టోబర్ 31(జనంసాక్షి): విధి నిర్వ హణకు వెళ్తూ రోడ్డు ప్రమా దానికి గురైన నంచర్ల గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ గడ్డిమీది రమేష్ చికిత్స పొందుతూ శనివా రం మృతి చెందారు. సెప్టెం బర్ 21న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

మక్తల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ వర్ధంతిని ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ అభివృద్ధికి, ఐక్యతకు ఆమె చేసిన సేవలను నాయకులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, బి. గణేష్ కుమార్, కౌన్సిలర్ వెంకటేష్, నీల గౌడ్, శంకర్, ఫయాజ్, కావలి ఆంజనేయులు, చందర్, అశోక్ గౌడ్, వడ్డె బాలరాజ్ పాల్గొన్నారు.

అక్రమ ఇసుక పట్టివేత

గద్వాల, అక్టోబర్ 31(జనంసాక్షి): ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రంగాపురం నుండి గద్వాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక టిప్పర్ వాహనాన్ని గద్వాల రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై వచ్చిన సమాచారంతో రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు గద్వాల పరిధిలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, మైనింగ్ అనుమతులు లేకుండా ప్రయాణిస్తున్న టిప్పర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ వాహనం ఎర్రవల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తిదిగా తేలింది. నిందితుడు కృష్ణ పెబ్బేర్ మండలం రంగాపురం నుండి ఇసుకను లోడ్ చేసుకుని గద్వాల పట్టణానికి తరలిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసినప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ అక్రమ రవాణాపై టిప్పర్ యజమాని కృష్ణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, మైనింగ్‌పై నిరంతర నిఘా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు.

నవజాత శిశువు లభ్యం..

పాపన్నపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఓ నవ జాత శిశువు లభ్యమైన ఘటన మెదక్ జిల్లాలో వెలుగు చూసింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. పోడ్చన్ పల్లి తాండా వద్ద ఇండ్ల వెనక గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగ శిశువును శనివారం ఉదయం వదిలి వెళ్లగా తండా వాసులు గమనించి పోలీసులకు, ఐసీడీఎస్, సీడబ్ల్యూసీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని పసిబిడ్డను అక్కడి నుంచి మెదక్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రభుత్వ నిలోఫర్ ఆస్పత్రికీ తరలించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కేసు నమోదైంది.

ఇందిరాగాంధీ
వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

తెలకపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి): మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఐక్యత, అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో
అనంతపురం విద్యార్థులు ప్రతిభ

గద్వాల నడిగడ్డ, ఆగస్టు31(జనంసాక్షి); పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ వారు నిర్వహించిన సైబర్ నేరాల నివారణలో పోలీస్ -పౌరుల పాత్ర అనే అంశం పై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గద్వాల మండల పరిధిలోని అనంతపురం జడ్పీహెచ్ఎస్ పదవ తరగతి విద్యార్థి ఇర్ఫాన్‌కు ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారము ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతినీ అందజేశారు. అదేవిధంగా అదే పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని ఐరావతి ద్వితీయ బహుమతిని ఎస్పీ చేతుల మీదుగా అందుకోవడం జరిగినది.ఈ సందర్భముగా విద్యార్థులను,గైడ్ టీచర్లు ఫ్రానిథెల్మ, జానకమ్మలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

మల్దకల్ ఆలయంలో స్వామీజీ ప్రత్యేక పూజలు

మల్దకల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మంత్రాలయం మఠం పూర్వ పీఠాధిపతి శ్రీ సువిదేంద్ర తీర్థులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌ను కరువు మండలంగా ప్రకటించాలి...

- 20 గ్రామాల్లో ఎండిన పంటలు.. కన్నీటిపర్యంతమవుతున్న రైతులు
- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి

మహమ్మదాబాద్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మహమ్మదాబాద్‌ను తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దిండికాడి గోపాల్ తదితరులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో మొత్తం 22 గ్రామాలు ఉండగా, కేవలం రెండు గ్రామాల్లో మాత్రమే నీటి వసతి ఉండటంతో పంటలు సాగవుతున్నాయని, మిగిలిన 20 గ్రామాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు గ్రామాల్లో పంటలు పండితే మండలమంతా సుభిక్షంగా ఉన్నట్లు కాదని, అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించాలని కోరారు.

సాగునీరు అందక పంటలు చేతికందే దశలో ఎండిపోవడంతో రైతులు పెట్టుబడులు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 12 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల కూడా పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు పిలుపు...

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మహేష్‌రెడ్డి సూచించారు. ఉమ్మడి గండీడ్ మండల పరిధిలో ఇప్పటికే 2 వేల మందికి పైగా నమోదు చేసుకున్నారని, నవంబర్ 6తో గడువు ముగియనున్నందున అర్హులందరూ సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తారా కళాశాలలో
అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- బీబీఏలో ఒకటి, ఆంగ్ల విభాగంలో రెండు పోస్టులు ఖాళీ
- కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.ప్రవీణ్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 31(జనంసాక్షి): తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ్ తెలిపారు. బీబీఏ విభాగంలో ఒకటి, ఆంగ్ల విభాగంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపారు. బోధనానుభవం ఉన్నవారితో పాటు జాతీయ అర్హత పరీక్ష (నెట్), రాష్ట్ర అర్హత పరీక్ష (స్లెట్), పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు.

ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికలు

- నవంబర్ 2న బాలురకు.. 3న బాలికలకు ఎంపికలు
- ఉమ్మడి మెదక్ జిల్లా ఖేలో ఇండియా ఇన్‌చార్జి అంజా గౌడ్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 31 (జనంసాక్షి): హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నవంబర్ 2, 3 తేదీల్లో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఖేలో ఇండియా ఇన్‌చార్జి అంజా గౌడ్ తెలిపారు. నవంబర్ 2న బాలురకు, 3న బాలికలకు ఎంపికలు నిర్వహిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపికల్లో విజయం సాధించిన క్రీడాకారులతో పాటు, జిల్లా స్థాయి ఎంపికలకు హాజరుకాని వారు కూడా నేరుగా రాష్ట్రస్థాయి ఎంపికల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పాఠశాల ధ్రువీకరణ పత్రం, పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని సూచించారు. 2009 జనవరి 1 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. అర్హత కలిగిన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయి ఎంపికల్లో పాల్గొనాలని అంజా గౌడ్ కోరారు.

గౌడ అఫీషియల్స్ అండ్
ప్రొఫెషనల్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 31 (జనంసాక్షి): గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా నాయిని భాగన్న గౌడ్ ప్రధాన కార్యదర్శిగా కౌండిన్య రాజశేఖర్ గౌడ్ ఆర్థిక కార్యదర్శిగా అబ్బా శశిధర్ గౌడ్ ఉపాధ్యక్షులుగా సుక్కల సత్యనారాయణ గౌడ్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ గోవర్ధన్ గౌడ్ చెరుకు వెంకటేష్ గౌడ్ భుజగౌని జగన్మోహన్ గౌడ్ సత్తూరు బాలరాజు గౌడ్ అమ్మిక సురేందర్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ ఆర్కే న్యూస్ జి.జగన్ మోహన్ గౌడ్ ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ ఉపాధ్యక్షులుగా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాయనోళ్ళ హర్షవర్ధన్ గౌడ్, గుమ్ముడాల రఘురాం గౌడ్ చుక్కల తిరుపతయ్య గౌడ్ ఎడ్ల వెంకటేష్ గౌడ్, అల్లిపూర్ శీను గౌడ్. జాయింట్ సెక్రటరీగా, జీనుగుంట సురేందర్ గౌడ్ తోకల నందకిషోర్ గౌడ్ తోకల రాజశేఖర్ గౌడ్ గురు ప్రసాద్ గౌడ్ సాంస్కృతిక కార్యదర్శిగా బాదేపల్లి వెంకటయ్య గౌడ్, లీగల్ అడ్వైజర్ గార్డ్ ,శ్రీశైలం గౌడ్.

గేటు మెంబర్గా సురేంద్ర గౌడ్ గౌరవ సలహాదారులుగా వాడడం సత్యనారాయణ గౌడ్లను ఎన్నుకోవడం జరిగింది.. ఎన్నికైన కార్యవర్గాన్ని అధ్యక్షుడు ఘనంగా సన్మానించడం జరిగింది.

సిద్ధార్థ పాఠశాలలో
పటేల్ జయంతి వేడుకలు

తెలకపల్లి, అక్టోబర్ 31 (జనంసాక్షి): సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఐక్యతకు పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపల్ శివప్రసాద్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో
చికిత్స పొందుతూ మరొకరు మృతి

మల్దకల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మండలంలోని శేషంపల్లి స్టేజి సమీపంలో ఈనెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐజ మండలం చిన్నతండ్రపాడు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ (26) శనివారం మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే ఒకరు, ఆసుపత్రికి తరలించే మార్గంలో మరొకరు మృతి చెందారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిడ్జిల్‌లో
ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

మిడ్జిల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎండీ గౌస్, సర్పంచ్ ఎడ్ల శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చేర్యాల, అక్టోబర్ 31(జనంసాక్షి): మండలంలోని కమలాయపల్లి గ్రామంలో ప్రభుత్వ డంపింగ్ యార్డు పెద్దును కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకుపెద్దు వద్ద గ్రామ ప్రజలు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ప్రభుత్వ డంపింగ్ యార్డును ఖానాపూర్ గ్రామానికి చెందిన వంటేరు శ్రీనివాస్ రెడ్డి తన అనుచరులతో వచ్చి ఈ నెల 29న కూలగొట్టాడని ఆరోపించారు. దీనిపై గ్రామస్తులంతా వెళ్లి నిలదీసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు పాలకులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారు ఢీకొని రెండు బైకులపై పలువురికి గాయాలు

మెదక్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం ముత్తయ్య కోట గ్రామ శివారులో టీఎస్ 08 యు ఎం 0550 స్విఫ్ట్ డిజైర్ గల కారు మెదక్ నుండి సర్దన గ్రామానికి వెళుతుండగా అతి వేగంతో వస్తూ సర్దన గ్రామంలో కూలి పని చేసుకుని మెదక్ వైపు వెళ్తున్న రెండు బైక్ లను ముత్తయి కోట శివారు గల బ్రిడ్జి వద్ద ఢీకొట్టాడు కారులో ఉన్న దుద్దెడ సంజీవరావు మద్యం మత్తులో రెండు బైకులు ఢీకొట్టినడు బాధితులుపాపన్నపేట మండలం పొడ్చాన్ పల్లి తాండకు చెందిన సర్వాన్ నాయక్ కాలు విరిగింది మిగతా వారికి తీవ్ర గాయాలు అయ్యాయి వారిని స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా హాస్పిటల్ తరలించారు సంజీవరావు మాత్రం అక్కడినుండి తప్పించుకుని వెళ్ళిపోయారు హవేలీ ఘనపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

చిన్న శంకరంపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి): మండల కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పెద్ద పల్లోరి పోగుల రాజు పటేల్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దేశ ఐక్యతకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటేల్ సేవలు చిరస్మరణీయం

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 31 (జనంసాక్షి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోణం విఠల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పేటలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మేధావుల సదస్సు

- బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్

నారాయణపేట అక్టోబర్ 31(జనం సాక్షి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ నెల 1వ తేదీ ఆదివారం నాడు ఉదయం 11 గంటలకు నారాయణ పేట జిల్లా కేంద్రంలోని మెట్రో ఫంక్షన్ హాల్‌లో మేధా వుల సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేధావుల సమావేశాని కి ముఖ్య అతిథిగా పాలమూరు పార్లమెంట్ సభ్యులు డి కే అరుణ పాల్గొంటారని తెలిపారు. ఈ సమాజం లోని డాక్టర్లు న్యాయవ దులు లెక్చరర్లు టీచర్లు కుల సంఘాల నాయకులు వ్యాపార వర్తకులు ఇతరే తర మేధావి వర్గాల అందరి కీ ఇదే మా ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు.

దేశ విచ్ఛిత్తికి ప్రజాస్వామ్య అపహాస్యానికి వివిధ రకా ల పేర్లతో విదేశీ నిధులతో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన వ్యవస్థలను కూల్చి వేయడానికి సిద్ధ మవుతున్న వేళ మేధావు లు కదలివచ్చి మేధావుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మేధావుల సమావేశాన్ని జయప్రదం చేయాలనీ కోరారు.

చేర్యాల పట్టణంలో 5, 6వ వార్డు కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

చేర్యాల, అక్టోబర్ 31 (జనంసాక్షి): జనగామ నియోజకవర్గ ఇంఛార్జి,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పిలుపు మేరకు చేర్యాల పట్టణంలో 5వ, 6వ వార్డు కమిటీలను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ సమావేశంలో 5వ వార్డు అధ్యక్షుడిగా బస్వరాజు యాదగిరి, 6వ వార్డు అధ్యక్షుడిగా బుట్టి బిక్షపతిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుర్మ ఆగంరెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, చేర్యాల మండల అధ్యక్షుడు మంజె మల్లేశం, కౌన్సిలర్లు పోతుగంటి ప్రసాద్, వెలుగల దుర్గయ్య, ఎండీ ఖాజా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పచ్చిమడ్ల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, ముస్త్యాల యాదగిరి, పచ్చిమడ్ల సతీష్, నాయకులు అంబాల నాగేశ్వర్ గౌడ్, చింతల మల్లేశం, కాటం శ్రీనివాస్, అంబాల రాము, బుట్టి యాదగిరి, పచ్చిమడ్ల సత్యనారాయణ, గూడ నాగశేఖర్, శ్రీరామ్ వెంకటేష్, బుడిగె సతీష్, మల్లిగారి తుమ్మలపల్లి సంతోష్, మల్లిగారి నరసింలు, ఎర్రమైసగాళ్ల గణేష్, బోదాసు బాబు, ఎండీ జహీరుద్దీన్, నర్ర మహేష్, పరాంకుశం వెంకటేష్, వెలుగల సంతోష్, బరిగెల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో ఇందిరాగాంధీ వర్ధంతి - ఘన నివాళులు

ఆత్మకూర్, అక్టోబర్ 31(జనంసాక్షి):తొలి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా శనివారం ఆత్మకూర్ లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి రహమతుల్లా, మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ ఎం.శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తులసి రాజ్‌యాదవ్, రైచూర్ పరమేష్, టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు,

గీతంలో 'హాలోవీన్ 2026'

పటాన్చెరు, అక్టోబర్ 31 (జనంసాక్షి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ వారు శనివారం 'ది ఫర్గాటెన్ ఫెయిర్ - హాలోవీన్ 2026'ను ఎంతో ఉత్సాహంగా, పండుగ వాతావరణంతో నిర్వహించారు. భయానకమైన ఇతివృత్తాలు, సృజనాత్మకమైన వేషధారణలు, ఉత్సాహభరితమైన కార్యకలాపాల ద్వారా హాలోవీన్ యొక్క అసలు స్వరూపాన్ని ఈ కార్యక్రమం చాటింది. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు, హాలోవీన్ స్ఫూర్తితో కూడిన ఉత్తేజకరమైన దుస్తుల ద్వారా తమ సృజనాత్మకతను ఊహాశక్తిని ప్రదర్శిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థులకు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, ఒకరితో మరొకరు మమేకమవ్వడానికి, ఉల్లాసభరితమైన ప్రాంగణ అనుభవాన్ని ఆస్వాదించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని ఈ కార్యక్రమం కల్పించింది. దీనిని పలువురు విద్యార్థులు అభినందించి, ఇటువంటి ఆసక్తికరమైన, సృజనాత్మక విద్యార్థి కార్యకలాపాలను ప్రోత్సహించినందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యానికి తమ కృతజ్ఞతలను తెలియజేశారు.

అనుమతులు లేకుండా బోర్లు వేయొద్దు...

- ఎల్‌నినో ప్రభావంతో నీటి వినియోగంలో పొదుపు పాటించాలి
- సర్పంచుల సమావేశంలో అధికారుల సూచన

పుల్కల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు సూచించారు. శనివారం పుల్కల్ మండల కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ బాల్‌రాజ్ అధ్యక్షతన సర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయబ్ తహశీల్దార్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సంబంధిత అధికారుల ముందస్తు అనుమతులు లేకుండా బోర్లు వేయరాదని స్పష్టం చేశారు. ఇష్టాను సారంగా బోర్లు తవ్వడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. తాగునీటిని వృథా చేయకుండా, గ్రామాల్లో నీటి వనరులను సంరక్షించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులకు సూచించారు. ఎంపీడీవో లక్ష్మి మాట్లాడుతూ నవంబర్ 15 నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభం కానుందని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ శంకర్, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

మంత్రాలు, చేతబడి, బాణామతి అన్నీ మూఢనమ్మకాలే

- మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు

టేక్మాల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మంత్రాలు, చేతబడి, బాణామతి వంటివన్నీ మూఢనమ్మకాలేనని టేక్మాల్ ఎస్సై ఆరవింద్ కుమార్, సాంఘిక సమానత్వ సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు.మెదక్ జిల్లా ఎస్పీ డి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం టేక్మాల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై ఆరవింద్ కుమార్ మాట్లాడుతూ, శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలోనూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించడం దురదృష్టకరమన్నారు. ఇటీవల గ్రామంలో కన్నతల్లిని కుమారుడు హత్య చేయడం బాధాకరమని పేర్కొన్నారు. దొంగ స్వాములు, భూతవైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఆర్థికంగా మోసం చేస్తున్నారని, ఇలాంటి వారిని నమ్మవద్దని సూచించారు. విద్య, శాస్త్రీయ ఆలోచనలతోనే సమాజం, దేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు.అనంతరం పోలీస్ కళాబృందం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఉప్పులేటి నరేష్ సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించి ఇసుక నుంచి నాణేలు తీయడం, కిరోసిన్‌తో మంటలు సృష్టించడం, నోటిలో మంటలు రావడం, పచ్చివేపాకులపై నీటితో మంటలు సృష్టించడం, ఇనుప చువ్వను నాలుకకు గుచ్చుకున్నట్లు ప్రదర్శించడం వంటి విన్యాసాల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవి నరసింహారెడ్డి, పోలీస్ కళాబృందం సభ్యులు సురేందర్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

• జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు - కలెక్టరేట్‌లో ఏక్తా ప్రతిజ్ఞ

మహబూబ్‌నగర్, బ్యూరో అక్టోబర్ 31 (జనంసాక్షి): దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఉక్కు మనిషి చిరస్మరణీయుడు...

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశాన్ని ఐకమత్యంగా ఉంచడంలో కృషిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని, దేశానికి దిశ, నిర్దేశం చేసిన ఆయన చిరస్మరణీయుడని అన్నారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని, దేశ అంతర్గత భద్రతను పటిష్టపరచడానికి స్వీయ తోడ్పాటునందిస్తానని జిల్లా కలెక్టర్ అధికారులు, ఉద్యోగుల చేత రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్‌ఓ ఏ. నిర్మల, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

నాగల్గిద్ద, అక్టోబర్ 31 (జనంసాక్షి): నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి శనివారం వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను, వివిధ కేసులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణ, స్టేషన్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి గ్రాడ్యుయేట్ వినియోగించుకోవాలి

• వెల్దండ గ్రామ ఉప సర్పంచ్- ఎర్ర శ్రీను ముదిరాజ్

వెల్దండ, అక్టోబర్ 31 (జనంసాక్షి): ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రామ ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను ముదిరాజ్ పిలుపునిచ్చారు.

శనివారం వెల్దండ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ అలీ సార్‌కి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు పత్రాలను ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగాఉప సర్పంచ్ మాట్లాడుతూ... పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యత అని, ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని తెలిపారు. గ్రామంలోని అర్హులైన పట్టభద్రులందరూ ముందుకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు చివరి తేదీ 06/11/2026 లోపు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ టౌను అధ్యక్షులు బాదేపల్లి మల్లయ్య గారు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాసారపుమల్లేష్ గారు తదితరులు పాల్గొన్నారు.

పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి: జిల్లా ఎస్పీ జి.వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 31(జనంసాక్షి): సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వినీత్ అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం దేశవ్యాప్తంగా విడివిడిగా ఉన్న సుమారు 560 సంస్థానాలను ఏకీకృతం చేసి, బలమైన ఐక్య భారతదేశ నిర్మాణానికి పునాది వేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి సేవలు, కృషి చిరస్మర ణీయమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆయన చూపిన చొరవ, దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 31వ తేదీన జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన, నైతిక విలువలను అలవర్చుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. కుల,మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో మెలుగుతూ జాతీయ సమైక్యతా భావాన్నిపెంపొందించుకోవాలని, దేశ సమగ్రతను కాపాడటంలో తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎస్పీ కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది జాతీయ సమైక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్, డిసిఆర్ బీడీఎస్పీ ఎ.మహేష్, ఆర్ఎస్ఐలు శివశంకర్, శిరీష, శివయ్య, డీపీఓ సిబ్బంది, ఆర్మడ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ చేతుల మీదుగా

ప్రశాంతపత్రం అందుకుంటున్న విద్యార్థి ఇందు

మల్దకల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): పోలీసు ఫ్లాగ్ డే, పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారము తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహించిన జోగులాంబ గద్వాల జిల్లాస్థాయి వ్యాసరచన ఆన్లైన్,ఆఫ్ లైన్ పోటీలలో తెలుగు మాధ్యమంలో అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న ఇందు విద్యార్థిని 10వ తరగతి జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసులు చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు నరేష్,ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు విష్ణు, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రఘుమారెడ్డి

• నిబద్ధతతో విద్యార్థులను తీర్చిదిద్దిన ఆదర్శ ఉపాధ్యాయుడు: వాకిటి శ్రీధర్

వనపర్తి అక్టోబర్ 31 (జనంసాక్షి): నిక్కచ్చిగా, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి సార్థకత చేకూర్చిన ఆదర్శ ఉపాధ్యాయుడు రఘుమారెడ్డి అని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ కొనియాడారు.

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన రఘుమారెడ్డి పదవీ విరమణ సందర్భంగా శనివారం నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్‌తో కలిసి వాకిటి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి, ఆయన సతీమణి అరుణ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

అనంతరం వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ ఉపాధ్యాయ ప్రస్థానంలో ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ ఉపాధ్యాయ రంగానికి గౌరవం తీసుకొచ్చారని పేర్కొన్నారు. విద్యాబోధనతో పాటు అయ్యప్ప మాలధారణ ద్వారా ఆధ్యాత్మిక సేవలోనూ రఘుమారెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితం సుఖసంతోషాలతో, ప్రశాంతంగా భక్తిమార్గంలో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ప్రధానోపాధ్యాయులు శివాజీ, గురురాజు యాదవ్, గగనం సీనయ్య, పి.శ్రీనివాస్ రెడ్డి, కంటే నిరంజన్, రవిప్రసాద్ గౌడ్, గోపాలకృష్ణ యాదవ్, భాస్కర్, యుగంధర్, శ్రీనివాసులు, దక్షిణామూర్తి, సుజీత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత్ బచ్పన్ అభియాన్



మల్దకల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): డిప్యూటీ లీగల్ సర్వీస్ అథారిటీ సంస్థ వారు మల్దకల్ మండలం అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు విష్ణు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం డీఎల్ఎస్ఎ శ్రీనివాసులు మాట్లాడుతూ బాలల హక్కులు బాల్యవివాహాలు పై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే బాల కార్మికుల వల్ల కలిగే నష్టాలను,బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల వచ్చే అనర్థాలను,డ్రగ్స్ వాడకం నివారణను విద్యార్థులకు తెలియజేశారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల నుండి ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్చార్జి ఉపాధ్యాయులు విష్ణు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు వేసుకోవాలి... ఏవో

మల్దకల్, అక్టోబర్ 31 (జనంసాక్షి): మండల పరిధిలోనితాటికుంట గ్రామంలో శనివారము రైతుల సమక్షంలో ఎల్నినో ప్రభావం గురించి మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావము వలన నీటి కొరత ఏర్పడుతుందని వరి,మొక్కజొన్న పంటలకు బదులుగా రైతు సోదరులు యాసంగి కాలంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.

ఆరుతడి పంటలకు తక్కువ నీటి తడులు ఇచ్చినా పంటలు పండును దీనితో పాటు కరెంట్ కొరత డిసెంబర్ నుంచి మొదలవుతుంది కాబట్టి రైతు సోదరులందరూ నీటి లభ్యతను,కరెంటును దృష్టిలో పెట్టుకొని పంటలను పండించుకోవాలి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయస్థానాధికారి ఖాజాబాషా, రైతులు పాల్గొన్నారు.